

అంతర్ జిల్లా మోసగాళ్లు అరెస్ట్

ప్రైవేట్ కంపెనీని ఏర్పాటు చేసి ప్రజల నుంచి భారీ ఎత్తున వసూలు చేసి మోసానికి పాల్పడ్డ ఇద్దరిని రాజన్నసిరిసిల్ల జిల్లా పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. 8లో▶

రోడ్డు ప్రమాదంలో టీచర్ మృతి



నార్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వర్తిస్తున్న మంజుల శనివారం స్కూటీపై ఆసిఫాబాద్ నుంచి వాంకిడికి వెళ్తున్న క్రమంలో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందింది. 8లో▶

గరిష్టం/కనిష్టం
32.4 /25.3

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. వాతావరణం చల్లబడుతుంది. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఉరుములు మెరుపులతో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బదావత్ సంతోష్



ఓటరు జాబితాను పరిశీలిస్తున్న కలెక్టర్

నస్పూర్: అక్టోబర్ 1, 2023 నాటికి 18 ఏళ్ల వయసు నిండే ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బదావత్ సంతోష్ తెలిపారు. పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లోని పోలింగ్ కేంద్రాలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2వ ఓటరు జాబితా సంక్షిప్త పునరీక్షణ కార్యాక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఓటరు నమోదు ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓటరు నమోదు, ఓటరు జాబితాలో మార్పులు, సవరణలు, తొలగింపులకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. వివరాలకు అన్ని పోలింగ్ కేంద్రాలు, బూత్‌స్థాయి అధికారులు, సహాయ ఓటరు నమోదు అధికారి, ఓటరు నమోదు అధికారులను సంప్రదించాలని సూచించారు. voters.esi.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

6 నుంచి గైర్హాజర్ కార్మికులకు కౌన్సెలింగ్

నస్పూర్: సింగరేణి సంస్థ శ్రీరాంపూర్ ఏరియాలోని గైర్హాజర్ కార్మికులకు ఈ నెల 6 నుంచి 11 వరకు జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఫ్యామిలీ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి డీజీఎం(పర్సనల్) రాజేశ్వర్‌రావు తెలిపారు. ఈ కౌన్సెలింగ్‌కు 2022, 2023, జూలై వరకు 50 మస్టర్ల కంటే తక్కువ చేసిన ఉద్యోగులు తప్పనిసరిగా హాజరుకాలని సూచించారు. ఈనెల 6న ఇందారం ఓసీపీ గని, ఇందారం 1ఏ గని, 7న ఎస్ఆర్పీ ఓసీపీ, జీఎం కార్యాలయం, సెక్యూరిటీ విభాగం ఉద్యోగులకు, 8న ఎస్ఆర్పీ-3, 3ఏ, 9న ఆర్కే-7, ఆర్కే న్యూటెక్, ఏరియా వర్క్‌షాప్ ఏరియా స్టోర్స్, టింబర్ యార్డు, 9న ఆర్కే-5, ఆర్కే-6, సీహెచ్‌పీ ఉద్యోగులకు ఫ్యామిలీ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు వివరించారు.

ఐటీఐలో అప్రెంటిస్‌షిప్ మేళా

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 4న అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చందర్ తెలిపారు. ప్రీమియర్ ఎనర్జీస్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో మేళా జరుగుతుందని పేర్కొన్నారు. ఫిట్టర్-80, ఎలక్ట్రీషియన్-100, వెల్డర్-70, డీజిల్ మెకానిక్-60 ఖాళీలు ఉన్నాయని వెల్లడించారు. ఐటీఐ పూర్తిచేసిన వారు ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు.

మంచిర్యాల 20 ఏళ్ల వెనక్కు వెళ్లింది

- మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు



మాట్లాడుతున్న ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అనాలోచిత నిర్ణయాలతో నియోజకవర్గ అభివృద్ధి 20 ఏళ్ల వెనక్కు వెళ్లిందని మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఆరోపించా రు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో శనివారం మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వెల్లువెత్తుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం వస్తేనే బతుకులు బాగుపడతాయని ప్రజలు భావిస్తున్నారని అన్నారు. తాను గత ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ ప్రజా క్షేత్రంలోనే ఉంటూ సేవ చేశానని తెలి పారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన కొద్ది రోజుల్లోనే ఐబీలో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ భవనంను కూల్చివేసి, అక్కడ మాతాశిశు ఆసుపత్రిని నిర్మిస్తానని తెలిపారు. యువతతోపాటు, ఇతర పార్టీలోని వారు తనపై నమ్మకంతో కాంగ్రెస్‌లో చేరుతున్నారని పేర్కొన్నారు. అభివృద్ధిని కాంక్షించే ఎవరైనా కాంగ్రెస్‌లో చేరాలని కోరారు.

'కాంగ్రెస్‌లో కోవర్టులు లేరు'

మంచిర్యాలటౌన్: కాంగ్రెస్ పార్టీ నాయకులపై ప్రభుత్వ విప్, చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు స్పందించారు. జిల్లా కేంద్రంలో శనివారం మాట్లాడారు. 'కాంగ్రెస్ పార్టీ వారు మనవారే, వారిని ఏమీ అనొద్దు.. వారు మనం పంపించిన వ్యక్తులే' అని చేసిన వ్యాఖ్యలను ఖండించారు. సుమన్ తనస్థాయికి మించి వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో కోవర్టులు లేరని, బీఆర్ఎస్‌లో ఓడిపోయేవారు ఇలా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు.

బీసీల టికెట్ పట్టు!

- 'మంచిర్యాల'లో పెరుగుతున్న డిమాండ్
- ఏకమైన ఆశావహులు..
- టికెట్ రాకపోతే ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టే యోచన



బీసీ రాజ్యాధికార సమితి సమావేశంలో మాట్లాడుతున్న గోనె ప్రకాశ్‌రావు, చిత్రంలో బీసీ నాయకులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మంచిర్యాల నియోజకవర్గంపై బీసీ నాయకులు పట్టుబిగిస్తున్నారు. జిల్లాలో ఉన్న ఏకైక జనరల్ అసెంబ్లీ సీటు కొన్నేళ్లుగా ఓసీలకే పరిమితమవుతోందని బీసీవర్గాలు గుర్రుగా ఉన్నాయి. ఈ క్రమంలో వచ్చే ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకే ఈ స్థానం కేటాయించాలన్న డిమాండ్ పెరుగుతోంది. అధికార బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, వంటి ప్రధాన పార్టీలతో సహా అన్ని రాజకీయ పార్టీలు బీసీలకే ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని కోరుతున్నారు. బీఆర్ఎస్ పార్టీ టికెట్లు ప్రకటించక ముందు నుంచే ఈ డిమాండ్ తెరపైకి వచ్చింది. అయినా బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేకే అవకాశం ఇవ్వడంతో ఆ పార్టీలోని బీసీ నాయకులు అసంతృప్తిలో ఉన్నారు. కొందరు పార్టీ వీడే యోచనలో ఉండగా, మరి కొందరు రెబల్‌గా బరిలో నిలవాలని చూస్తున్నారు. ఇప్పటికే కొందరు నాయకులు తమ పార్టీ నుంచి టికెట్లు దక్కే అవకాశం లేకపోవడంతో ఇతర పార్టీల వైపు చూస్తున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ బీసీలకు టికెట్ ఇవ్వకుంటే.. బీసీల ఉమ్మడి అభ్యర్థితో నామినేషన్ వేస్తామని ప్రకటించారు.

విస్తృతంగా కార్యక్రమాలు..

వచ్చే ఎన్నికల్లో బీసీ అభ్యర్థినే ఎమ్మెల్యేగా నిలబెట్టి, గెలుపించుకోవాలనే లక్ష్యంగా విస్తృతంగా కార్యక్రమాలు సాగుతున్నాయి. రౌండ్ టేబుల్ సమావేశాలు, చర్చలు, సదస్సులు నిర్వహిస్తున్నారు. తాజాగా 'బీసీ రాజ్యాధికార ఐక్య వేదిక కమిటీ'ని ఏర్పాటు చేశారు. బీసీల రాజ్యాధికారమే లక్ష్యంగా ఈ కమిటీ పని చేస్తుందని ప్రకటించారు. ఈ కమిటీ బీసీలు అందర్నీ ఏకం చేసేందుకు పని చేస్తుందని ప్రకటించారు. తెలంగాణ బీసీ జాగృతి, బీసీ ఐక్యవేదిక, సంక్షేమ సంఘం తదితర సంఘాలు ఈ కార్యక్రమాలను ముందుకు నడిపిస్తున్నాయి. ఆయా పార్టీల నుంచి టికెట్ ఆశిస్తున్న నాయకులందర్నీ ఒకే చోట చేర్చి, ఉమ్మడి కార్యచరణ ఏర్పాటు చేసుకున్నారు.

మాజీ ఎమ్మెల్యే అరవింద్‌రెడ్డి మద్దతు

మంచిర్యాలలో సిట్టింగ్ ఎమ్మెల్యేకు మరోమారు టికెట్ ఇవ్వడాన్ని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవింద్‌రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. వారం రోజుల్లో అభ్యర్థిని మార్చకుంటే, బీసీ నాయకున్ని నిలబెట్టి గెలిపించుకుంటామని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే, రాజకీయ విశ్లేషకులు గోనె ప్రకాశ్‌రావు సైతం బీసీలకే టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సొంతంగా తన వంతు ఆర్థిక సాయం కూడా చేస్తానని ప్రకటించారు. బీసీ అభ్యర్థి తెరపైకి వచ్చినప్పటి నుంచి మేధావులు, విద్యార్థులు, తదితర వర్గాల నుంచి మద్దతు పెరుగుతోంది. పలు బీసీ సంఘాల నాయకులు సైతం అందరినీ ఒక్కతాటిపైకి తెచ్చి, బీసీ అభ్యర్థిని బరిలో నిలిపి గెలిపించేందుకు ప్రజామద్దతు కోసం ప్రచారం చేస్తున్నాయి.

బీసీ గర్జనకు సన్నద్ధం..

రాజకీయంగా బీసీల బలం చూపించుకునేందుకు ఓ భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. బీసీల ప్రధాన కులాల్లో ఉన్న నాయకులు, ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ పడుతున్న వారంతా కలిసి బీసీ గర్జన పేరుతో సభ నిర్వహించాలనే ఆలోచనలు చేస్తున్నారు. ఈ మేరకు అందరినీ సంఘటితం చేస్తున్నారు. మంచిర్యాల నియోజకవర్గంలో మొత్తం 2.50 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 60 శాతంపైనే బీసీలే. మిగతా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఓటర్లను కలిపితే 90 శాతంకు చేరుతారు. బీసీలతోపాటు ఇతర కులాలను కలుపుకు పోయి, జనరల్ సీటులో సత్తా చాటేందుకు బీసీలు సన్నద్ధమవుతున్నారు. దీంతో వచ్చే ఎన్నికల్లో మంచిర్యాలలో బీసీ నినాదం ప్రభావం చూపే అవకాశం ఉంది.

బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ షురూ..!

- నేటి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- జిల్లాలో 473 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ



మంచిర్యాలఅర్బన్: జిల్లాలో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల సందడి మొదలైంది. కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విద్యాశాఖ ఇప్పటికే ప్రకటించింది. ఆదివారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. బదిలీ, పదోన్నతులకు హైకోర్టు అనుమతి ఇవ్వడంతో విద్యశాఖ ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు, ఎనిమిది సంవత్సరాలు సర్వీసు పూర్తయిన ఉపాధ్యాయుల వివరాలు సేకరిస్తోంది. ఇదివరకు జనవరి నెలను బదిలీలకు కటాఫ్ డేట్ ప్రకటించగా ప్రస్తుతం సెప్టెంబర్ 1 వరకు పొడిగించారు. దీంతో బదిలీలకు మరింత మంది అర్హత పొందే అవకాశం ఉంది. ఇదివరకు 1,386 మంది బదిలీలకు దరఖాస్తులు చేసుకోగా, సెప్టెంబర్ 1వరకు కటాఫ్ డేట్ ఇవ్వటంతో మరో 400 మంది దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని సమాచారం. ఒకేచోట ఎనిమిదేళ్లు పనిచేసిన వారికి తప్పనిసరిగా బదిలీ కానున్నారు. ఐదేళ్లు పనిచేసిన హెచ్ఎంలకు తప్పనిసరిగా స్థానచలనం కలుగుతుంది. మూడేళ్ల సర్వీసు ఉన్న వారికి మాత్రం బదిలీ నుంచి మినహాయింపు ఇవ్వనున్నారు.

స్థానచలనం ఇలా..

ఇదివరకు 1,386 మంది బదిలీలకు దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో పీజీహెచ్ఎంలు 50 మంది ఉన్నారు. సెప్టెంబర్ 1 కటాఫ్ డేట్‌తో 62 మందికి 62 హెచ్ఎంలు దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. మూడేళ్లలోపు మినహాయిస్తే ఎనిమిది మంది బదిలీకి దూరంగా ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గత దరఖాస్తుల ప్రకారం 470 మంది ఎస్ఏలు, 702 మంది ఎస్జీటీలు, 130 ఎల్‌పీలు, 22 మంది పీఈటీలు బదిలీకి అవకాశం ఉండగా, ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ఇలా..

- మొదట గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు బదిలీలు జరుగుతాయి.
- తర్వాత అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా ఎపదోన్నతి కల్పిస్తారు.
- అప్పటికే ఉన్న స్కూల్ అసిస్టెంట్ ఖాళీలతోపాటు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పదోన్నతి పొందిన స్కూల్ అసిస్టెంట్‌లకు బదిలీలకు అవకాశం ఇవ్వనున్నారు.
- అర్హులైన ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించనున్నారు. ఇదివరకు ఉన్న ఎస్జీటీ ఖాళీలతోసహా ఎస్జీటీల నుంచి ఎస్ఏలుగా పదోన్నతి పొందిన ఖాళీలను కలుపుకుని ఎస్జీటీల బదిలీలు చేపడతారు.

స్కూల్ అసిస్టెంట్ ఖాళీలు

	తెలుగు మీడియం	ఉర్దూ మీడియం
గణితం	8	1
భౌతికశాస్త్రం	1	2
జీవశాస్త్రం	37	3
సాంఘిక శాస్త్రం	82	03

తెలుగు-16, హిందీ-12, ఆంగ్లం-17, ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషనల్-1, పీఎస్‌హెచ్ఎం-41 గ్రేడ్ హెచ్ఎం-43.

భాషా పండితులుతెలుగు-05, హిందీ-08 ఉర్దూ-02

సెకండరీ గ్రేడ్ టీచర్లు- ఎస్జీటీ (తెలుగుమీడియం- 161, ఉర్దూ మీడియం-10, ఇంగ్లిష్ మీడియం - 02

- పీఈటీ తెలుగు-02

మ్యూజిక్ టీచర్-01, ఆర్ట్ అండ్ డ్రాయింగ్ -04, ఎంటీఐ, పీవీఐ, ఎస్ఐ (తెలుగు)-06 వొకేషనల్ ఇన్‌స్ట్రక్టర్-04

ఖాళీలు ఇలా..

జిల్లాలో 2,855 పోస్టులకుగాను 2,382 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. 473 ఖాళీలు ఉన్నాయి. లోకల్ బాడీ పాఠశాలలో 2,689 మంజూరు పోస్టులకు 2,255 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తుండగా 434 ఖాళీలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలలో 166 పోస్టులకు 128 మంది విధులు నిర్వహిస్తుండగా 38 ఖాళీలు ఉన్నాయి. పీజీహెచ్ఎం105 పోస్టుల్లో 43, పీఎస్‌హెచ్ఎం-69 పోస్టుల మంజూరులో 39 పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది.

దరఖాస్తుల స్వీకరణ ఇలా ..

ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. 6, 7, 8 తేదీల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసిన కాపీలను డీఈవో కార్యాలయంలో సమర్పించాలి. 8, 9 తేదీల్లో దరఖాస్తులు చేసుకున్న వారి పేర్లను ప్రదర్శించనున్నారు. 10, 11 తేదీల్లో అభ్యంతరాల స్వీ కరణ ఉంటుంది. 12, 13న సీనియారిటీ జాబి తా ప్రదర్శన, 14న ఎడిట్ ఆప్షన్‌కు అవకాశం కల్పించారు. 16న ప్రధానోపాధ్యాయుల ఖా ళీల ప్రదర్శిస్తారు. 17, 18, 19 తేదీల్లో ఎస్ఏలకు ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి, 20, 21న ఖాళీ అయిన స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ప్రదర్శిస్తారు. వెబ్ ఆప్షన్ ఇవ్వనున్నారు. 22న ఎడిట్ ఆప్షన్, 23, 24 తేదీల్లో స్కూల్ అసిస్టెంట్ల బదిలీలు, వెబ్ ఆప్షన్‌కు అవకాశం ఉంటుంది. 23, 24 తేదీల్లో స్కూల్ అసిస్టెంట్ల బది లీలు, స్కూల్ అసిస్టెంట్ ఖాళీలను ప్రదర్శించనున్నారు. 26, 27, 28న ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ ఇస్తారు. 29, 30, 31న ఎస్జీటీ ఖాళీలు ప్రకటిస్తారు. అక్టోబర్ 2న ఎడిట్ ఆప్షన్, 3న ఎస్జీటీ భాషా పండిత, పీఈటీల బదిలీలు ఉంటాయి. 5 నుంచి 19 వరకు అప్పీల్‌కు అవకాశం కల్పించారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్



సమీక్షలో కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్: పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ కలెక్టర్లకు సూచించారు. హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు ఎన్నికల అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. నూతన ఓటు నమోదు, ఓటరు జాబితా రూపకల్పన, ఎన్నికల నిర్వహణ, పోలింగ్ కేంద్రాలు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల ప్రతిపాదన, తదితర అంశాలపై సూచనలు చేశారు. ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద అన్ని మౌలిక వసతులు కల్పించాలన్నారు. దివ్యాంగులు, గర్భిణులు, వృద్ధుల కోసం ర్యాంప్ నిర్మించాలని సూచించారు. అక్టోబర్ 1 వరకు సమగ్ర తుది ఓటరు జాబితా రూపొందించి అక్టోబర్ 4న ప్రచురించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటు నమోదు చేసుకునేలా చూడాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ బదావత్ సంతోష్, ఆర్డీవో రాములు, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మేకల మందపై దాడి చేసింది చిరుతే!

- సీసీ కెమెరాల ద్వారా గుర్తింపు



మేక కళేబరాన్ని తీసుకెళ్తూ కెమెరాకు చిక్కిన చిరుత

కాసిపేట: మండలంలోని పెద్దధర్మారం గ్రామశివారు అటవీ ప్రాంతంలో శుక్రవారం మేకల మందపై దాడి చేసింది చిరుత పులే అని అటవీశాఖ అధికారులు నిర్ధారించారు. అధికారులు పాదముద్రల ఆధారంగా చిరుత అని చెప్పగా మేక ల కాపరులు ప్రత్యేక్షంగా చూశామని, అది పెద్దపులని పేర్కొన్నారు. దీంతో అటవీ అధికారులు మేక కళేబరం ఉన్న చోట సీసీ కెమెరాలు అమర్చారు. శనివారం డెప్యూటీ రేంజ్ అధికారి ప్రవీణ్‌నాయక్ ఆధ్వర్యంలో అధికారులు సీసీ కెమెరాలను పరిశీలించగా చిరుత కనిపించింది. సాయంత్రం 4.41 గంటలకు చిరుత వచ్చి మేక కళేబరాన్ని తీసుకువెళ్లిందని, రాత్రి 7.36 గంటలకు అదే ప్రాంతంలోకి వచ్చి సంచరించినట్లుగా వెల్లడించారు. సీసీ కెమెరాలో రికార్డు అయిన ఫొటోల ఆధారంగా చిరుతపులి గర్భంతో ఉన్నట్లుగా గుర్తించారు. ఈ ప్రాంతంలో ఎలుగుబంటి పాదముద్రలు ఉండడంతో ఇదే ప్రాంతంలో తిరుగుతున్నట్లు అనుమానాలు వ్యక్తం చేశారు. అటవీ ప్రాంతంలో రెండు మూడు చిరుతపులులు, ఎలుగుబంట్లు ఉన్నాయని, ఒంటరిగా అటవీ ప్రాంతానికి వెళ్లొద్దని, కాపరులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలి

- జిల్లా న్యాయమూర్తి ప్రభాకరరావు



మాట్లాడుతున్న జిల్లా జడ్జి ప్రభాకరరావు

లక్సెట్టిపేట: ఈనెల 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా కృషి చేయాలని జిల్లా న్యాయమూర్తి ప్రభాకరరావు న్యాయవాదులు, పోలీస్ సిబ్బందికి సూచించారు. లక్సెట్టిపేట మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టును శనివారం సందర్శించి మాట్లాడారు. కోర్టు ఆవరణలో తిరిగి పరిసరాలు గదులను చూశారు. రిజిస్టర్లు, ఇతర రికార్డులను పరిశీలించారు. కోర్టు సిబ్బంది సమయ పాలన పాటించాలని విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. ప్రతీరోజు రిజిస్టర్‌లో నమోదు చేసేలా చూడాలని, పెండింగ్ ఉండకూడదని సూపరింటెండెంట్ ఇంతియాజ్‌కు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కక్షిదారులు ఏకమై రాజీకి వస్తే కేసులను పరిష్కరించవచ్చని తెలిపారు. కక్షిదారులతో మాట్లాడి పెండింగ్ కేసులు, ఇతర వాటిపై దృష్టి పెట్టాలన్నారు. సమావేశం అనంతరం న్యాయమూర్తిని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఉదయ్‌కుమార్, జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్, మంచిర్యాల బార్ అధ్యక్షుడు కొత్త సత్తయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కారుకూరి సురేందర్, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, జాయింట్ సెక్రటరీ నళినికాంత్, ఏజీపీ పద్మ, సీఐ క్రిష్ణ, ఎస్సై లక్ష్మణ్, కోర్టు సూపరింటెండెంట్ ఇంతియాజ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం



రాజశేఖరరెడ్డికి నివాళులర్పిస్తున్న వినోద్

బెల్లంపల్లి: ఉమ్మడి రాష్ట్ర దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని మాజీ మంత్రి గడ్డం వినోద్ తెలిపారు. పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో వైఎస్సార్ 14 వర్ధంతి శనివారం నిర్వహించారు. వైఎస్సార్ చిత్రపటానికి వినోద్ పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వైఎస్సార్ హయాంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి సాధించిందన్నారు. జైపూర్‌లో పవర్ ప్రాజెక్టు, గొల్లవాగు ప్రాజెక్టు వైఎస్సార్ హయాంలోనే మంజూరు అయ్యాయని తెలిపారు. వందల కోట్ల రూపాయలు చెన్నూర్ నియోజకవర్గానికి మంజూరు చేశారని గుర్తుచేశారు. అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్ అనేక పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. నాటి పథకాలనే నేడు పాలకులు తామే ప్రవేశపెట్టినట్లు చెప్పుకుంటున్నారని విమర్శించారు. సంక్షేమ పాలనతో వైఎస్సార్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మత్తమారి సూరిబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ కారుకూరి రాంచందర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎం.మల్లయ్య, కాంగ్రెస్, అనుబంధ సంఘాల నాయకులు సింగతి సత్యనారాయణ, ఎండీ.ఈసా, రత్నం ప్రదీప్, రాజన్న, ఆనంద్, చిన్నరాజం, అంకం రవి, శ్రీనివాస్‌గౌడ్, చంద్రమౌళి, గౌస్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏరియర్స్ ఒకేదఫాలో చెల్లించాలి

- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి.సీతారామయ్య



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సీతారామయ్య

నస్పూర్: సింగరేణి కార్మికులకు చెల్లించాల్సిన 11వ వేజ్‌బోర్డుకు సంబంధించిన 23 నెలల ఏరియర్స్ కోల్ ఇండియా మాదిరిగా ఒకే దఫాలో చెల్లించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య తెలిపారు. ఆర్కే-6 గనిపై శనివారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలతో సింగరేణి సంస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న అనేక హక్కులను యాజమాన్యం కాలరాస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కె.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు ఎస్‌కే.బాజీసైదా, ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, నాయకులు సంఘం సదానందం, చిలుక రాంచందర్, నగేశ్, మహేశ్, నర్సింగరావు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

104 కాంట్రాక్ట్ ఉద్యోగుల ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న 104 ఉద్యోగులు

నస్పూర్: జిల్లాలోని 104 కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు తెలిపారు. ఉద్యోగులతో కలిసి సమీకృత కలెక్టరేట్ ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 15 ఏళ్లుగా ఎలాంటి భద్రత లేకుండా చాలీచాలని వేతనాలతో 1,350 మంది ఉద్యోగాలు చేస్తున్నట్లు తెలిపారు. 2022 నుంచి ప్రభుత్వం పూర్తిగా 104 వాహనాలు నిలిపివేయసిన సందర్భంలో తమకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చిందని అన్నారు. ఉద్యోగులను పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రి, టీ హబ్ సెంటర్లలో రీడిప్లై చేసిందని విరించారు. జీవో 60 ప్రకారం ఉద్యోగులకు స్లాబ్ పద్ధతిన వేతనాలు చెల్లించడం ద్వారా తీవ్రంగా నష్టపోతున్నామని పేర్కొన్నారు. 104 ఎఫ్‌డీహెచ్ఎస్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, సమానపనికి సమాన వేతనం చెల్లించాలని, వేతనాలు ట్రెజరీల ద్వారా చెల్లించాలని, ఉద్యోగులకు ఆప్షన్లు ఇచ్చి సొంత జిల్లాలకు బదిలీ చేయాలని, హెల్త్‌కార్డు, ఆరోగ్యబీమా కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల వేతనాలు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌చారి, ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు డి.కృష్ణ, ఎస్.పురుషోత్తం, కోశాధికారి కె.వేదవతి, నాయకులు రాంచందర్, కె.నారాయణ, సత్యం, రాజన్న, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ కోసం నిరసన దీక్ష



దీక్ష చేస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

మంచిర్యాలటౌన్: ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ ప్రకటించాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ బల్మూరి పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో యూనియన్ నాయకులు శనివారం ఒకరోజు నిరసన దీక్ష చేపట్టారు. ఖాళీ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని, ఆర్ట్‌అండ్‌క్రాఫ్ట్ ఖాళీలు వెంటనే ప్రకటించాలని, ప్రభుత్వ విద్యావ్యవస్థను ప్రైవేట్‌కు ధీటుగా బలోపేతం చేయాలని, స్టూడెంట్‌రేషియో కాకుండా సబ్జెక్టుల రేషియో ప్రకారం ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. దీక్షకు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ పూదరి తిరుపతి, మంచిర్యాల పట్టణ అధ్యక్షులు తూముల నరేశ్, పీసీసీ సభ్యులు కొండ శేఖర్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షులు బానేష్, పూదరి ప్రభాకర్, నస్పూర్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుర్మిల్ల వేణు, యూత్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు తాళ్ల సంపత్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు తిరుమల రావు, నరిగే నగేష్, మల్లయ్య, రోహిత్, శివ, బొడ్డు రాజ్‌కుమార్, కృష్ణ, సందీప్, అమృత్, విజయ్, సతీశ్, మల్లికార్జున్‌రెడ్డి, సాయి కిరణ్‌రెడ్డి, అక్షయ్ సంఘీభావం తెలిపారు.

మెగా డీఎస్సీ ప్రకటించాలి

బెల్లంపల్లి: ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి ప్రభుత్వం వెంటనే మెగా డీఎస్సీని ప్రకటించాలని టీపీసీసీ సభ్యుడు చిలుముల శంకర్, ఎన్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఆదర్శ్ వర్ధన్‌రాజు డిమాండ్ చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయం ఆవరణలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో శనివారం నిరసన దీక్ష చేపట్టారు. శంకర్ దీక్షను ప్రారంభించి మాట్లాడారు. నిరుద్యోగుల జీవితాలతో బీఆర్ఎస్ ప్రభుత్వం చెలగాటమాడుతోందని విమర్శించారు. ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నా అరకొరగా ఖాళీలు ఉన్నట్లు లెక్కల గారడి చూపించిందని విమర్శించారు. అసెంబ్లీలో సీఎం కేసీఆర్ ప్రకటించిన విధంగా 13 వేల ఖాళీలతో డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీక్ష శిబిరాన్ని మాజీ మంత్రి గడ్డం వినోద్ సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఎనగందుల వెంకటేశ్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు, నిరుద్యోగులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పిడుగుపాటుతో రిటైర్డ్ కార్మికుడి మృతి


లింగయ్య మృతదేహం

భీమారం: మండల కేంద్రంలోని తెనుగువాడకు చెందిన బండారి లింగయ్య (68) సింగరేణి రిటైర్డ్ కార్మికుడు శనివారం సాయంత్రం పిడుగుపాటుతో మృతి చెందాడు. బ్యాంక్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా ఇంటి సమీపంలో పిడుగు పడడంతో అక్కడికక్కడే చనిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు చేరుకుని బోరున విలపించారు. మృతుడికి భార్య రమతో పాటు కుమారుడు సాయికిరణ్, కుమార్తె ఉన్నారు.

పిడుగుపాటుతో యువతి...

బెజ్జూర్: మండలంలోని పోతెపల్లి గ్రామానికి చెందిన తొడసం పోసక్క (20) శనివారం పిడుగుపాటుకు గురై మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన బూదక్కతో కలిసి సమీపంలోని చేనులోకి మిరపనారు వేయటానికి ఉదయం వెళ్లింది. సాయంత్రం నారు వేస్తున్న క్రమంలో పిడుగుపడటంతో పోసక్క అక్కడికక్కడే మృతి చెందింది. పక్కనే ఉన్న భూదక్కకు తీవ్ర గాయాలు కావడంతో గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. మృతురాలు మంచిర్యాలలోని బీఎస్సీ నర్సింగ్ విద్యను అభ్యసిస్తుండగా ఇటీవల రాఖీ పండుగకు సోదరుడికి రాఖీ కట్టడానికి వచ్చి మృత్యువాత పడింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. అలాగే మండలంలోని కుశ్నపల్లి గ్రామానికి చెందిన నికాడి అశోక్ ఎద్దు మృతి చెందింది. రూ.40వేలు విలువ చేసే ఎద్దు పిడుగుపాటుతో మృతి చెందడంతో రైతు కన్నీరుమున్నీరు అవుతున్నాడు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

దహెగాం: మండల కేంద్రానికి చెందిన ఆసంపల్లి మహేష్ అనే యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఎస్సై సనత్‌కుమార్ వివరాల ప్రకారం.. మహేష్ ఉదయం 11గంటల ప్రాంతంలో మండల కేంద్రానికి సమీపంలోని ప్రాణహిత కెనాల్ వద్దకు వెళ్లి నేను చనిపోతున్నానని భార్యకు మెసెజ్ చేశాడు. వెంటనే గమనించిన భార్య కుటుంబ సభ్యులకు తెలిపింది. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. స్పందించిన ఎస్సై సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా లోకేషన్‌ను గుర్తించి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే అతడు పురుగుల మందు తాగిపడిపోయాడు. దీంతో 108 అంబులెన్సులో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెల్లంపల్లికి తరలించారు. ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు.

బావురావుపేట సమీపంలో గుడిసెలు దగ్ధం

చెన్నూర్‌రూరల్: మండలంలోని బావురావుపేట గ్రామ సమీపంలోని ప్రభుత్వ భూమిలో పేదలు వేసుకున్న గడిసెలను గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్లతో కూల్చి దగ్ధం చేశారు. అడ్డుకునేందుకు వెళ్లిన వారిపై దాడి చేసి గుడిసెలను దగ్ధం చేశారని బాధితులు తెలిపారు. వెంటనే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

చర్యలు తీసుకోవాలి

గుడిసెలను ట్రాక్టర్‌లతో కూల్చి, పెట్రోల్ పోసి దగ్ధం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పైళ్ల ఆశయ్య డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొడెంకి చందు ఉన్నారు.

కేసులు నమోదు చేయాలి

గుడిసెలను దగ్ధం చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి గోమాస ప్రకాష్ డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ సభ్యుడు రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు

ఉపాధ్యాయుల శ్రమకు తగిన ఫలితం దక్కింది. విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడంలో వారి కృషిని ప్రభుత్వం గుర్తించింది. చదువుతో పాటు విద్యార్థులు కార్పొరేట్ కళాశాలల్లో ఉచితంగా సీట్లు సాధించేలా చేయడంలో ఒకరు.. తోటి ఉపాధ్యాయులకు బోధనలో మెలకువలు నేర్పడంలో మరొకరు... సైన్స్‌పై మక్కువ పెంచేలా బోధన చేస్తున్న మరొకరు ఇలా రాణిస్తున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నలుగుర్ని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసింది. వారికి ఈ నెల 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అవార్డులను సైతం అందించనుంది.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా రమేశ్

- ఈ నెల 5న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి చేతుల మీదుగా అవార్డు


రమేశ్

జన్నారం: ఉపాధ్యాయ వృత్తిని ఫ్యాషన్‌గా భావించి, విద్యార్థులను బావిపౌరులుగా తయారు చేయడానికి తనవంతు కృషిలో ఉత్తమ సేవలందించినందుకు రాష్ట్రస్థాయి గుర్తింపు లభించింది. పదో తరగతి విద్యార్థులను ప్రేరణ చేయడంలో, ఉత్తమ ఫలితాల సాధనలో, జాతీయ ఉపకార వేతనాలు పొందడంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చి జిల్లా, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చిన జన్నారం మండలం కలమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు (సైన్స్) మురిమడుగుల రమేశ్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడుగా అర్హత సాధించాడు.

పదో తరగతి విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ

రెండేళ్లుగా పదో తరగతి విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించి, వారి చదువుపై దృష్టి సారించారు. ఉదయం 4గంటలకు లేచి చదువుకునేలా ప్రతీ రోజు మానిటరింగ్ చేయడం, ప్రధానోపాధ్యాయుడు జాడి ప్రభాకర్ ఆదేశాల మేరకు పదో తరగతి విద్యార్థులకు వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసి ప్రతి రోజు ఉదయం, సాయంత్రం చదువుకునే ఫొటో, చదివిన సబ్జెక్టు వివరాలను గ్రూపులో


విద్యార్థులతో మొక్కలు నాటిస్తున్న ఉపాధ్యాయుడు

అప్‌లోడ్ చేసే విధంగా మానిటరింగ్ చేశారు. అదే విధంగా జాతీయ ఉపకార వేతనాలు పొందడంలో జిల్లా స్థాయిలో ర్యాంకులు సాధించేలా చేయడం, 2019 లో జిల్లా రెండో స్థానం, 2022లో జిల్లా నాలుగోస్థానంలో నిలిచారు. జాతీయ ఉపకార వేతనాలు పొందే ఎంపిక పరీక్ష కోచింగ్ రమేశ్ ఇచ్చేవారు. దీంతో పాటు పదో తరగతి చదివే విద్యార్థులు పోటీ పరీక్షలు, మేధో లాంటి స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నడిచే కార్పొరేట్ కళాశాలల్లో సీట్లు సాధించడానికి ఆయన కోచింగ్ ఇవ్వడమే కాకుండా రాయడానికి తీసుకెళ్లి, అర్హత పొందేలా కృషి చేశారు. రెండు సంవత్సరాలుగా పలువురు విద్యార్థులు మేధా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కార్పొరేట్ కళాశాలల్లో ఉచితంగా చదివేందుకు అర్హత సాధించారు. అలాగే పాఠశాల పచ్చదనంలోనూ కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఈ సందర్భంగా రమేశ్‌ను సర్పంచ్ కార్తీక్‌రావు, జిల్లా విద్యాధికారి యాదయ్య, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇన్నారెడ్డి, మండల విద్యాధికారి విజయ్‌కుమార్, హెచ్ఎం ప్రభాకర్, ఎన్‌సీసీ అధికారి రాజమౌళి అభినందించారు.


విద్యార్థులకు యోగా పాఠాలు బోధిస్తున్న గంగా శంకర్

బోధనకు మెచ్చి..

- ఉత్తమ ఉపాధ్యాయులుగా సిద్ధ పద్మ, గంగా శంకర్

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలోని మంజులాపూర్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న సిద్ధ పద్మ, సోఫీ నగర్ గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న నీరడీ గంగా శంకర్‌ల సేవలకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికచేసింది. విద్యార్థులకు తాను చేసిన సేవకు దక్కిన ఫలితమే రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అని సిద్ధ పద్మ పేర్కొన్నారు. 2000, నవంబర్‌లో డీఎస్సీ ద్వారా బయో సైన్స్ స్కూల్ అసిస్టెంట్‌గా తానూర్ మండలంలోని ఎల్వి ఉన్నత పాఠశాలలో మొదటి ఉద్యోగం సాధించగా ఆ తర్వాత 2005లో ఖానాపూర్ బాలికల పాఠశాలలో పీజీహెచ్ఎంగా ప్రమోషన్ పొందింది. 2009లో నిర్మల్ మండలంలోని రత్నాపూర్ కాండ్లీ ఉన్నత పాఠశాలకు బదిలీ కాగా 2013 నుంచి 2015 వరకు నిర్మల్ ఎంఈవోగా బాధ్యతలు నిర్వహించారు. 2017 నుంచి 2020 వరకు డీఈవో కార్యాలయంలో సమగ్ర సర్వ శిక్ష అభియాన్ జిల్లా అధికారిగా పనిచేశారు. ఆ తర్వాత 2000 నుంచి 2023 వరకు ప్రస్తుతం పనిచేస్తున్న మంజులాపూర్ ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. 2021లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు.


నీరడీ గంగా శంకర్

అత్యుత్తమ బోధనకు

జిల్లా కేంద్రంలోని సోఫినగర్ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న నీరడీ గంగా శంకర్ అత్యుత్తమ బోధనకు రాష్ట్ర ప్రభుత్వం అవార్డును అందించనుంది. నిజామాబాద్ జిల్లా రెంజల్ మండల కేంద్రానికి చెందిన గంగా శంకర్ 1992లో నిజామాబాద్ ఎడపల్లి ఉన్నత పాఠశాలలో ఎస్జీటీగా విధులు ప్రారంభించారు. ఆ తర్వాత 1996లో పోచంపాడు బాలికల కళాశాలలో పీజీటీగా... తర్వాత 2006లో బోధన్ బాలికల పాఠశాలలో పనిచేశారు. 2016లో పోచంపాడు బాలుర కళాశాలకు బదిలీ అయ్యారు. 2018 నుంచి సోఫీనగర్ గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 2019లో జిల్లా ఉత్తమ ప్రిన్సిపాల్‌గా అవార్డు లభించింది. 2023 దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఉత్తమ ప్రిన్సిపల్‌గా అవార్డు అందుకున్నారు. తల్లి గృహిణి కాగా.. తండ్రి రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడుగా ఉన్నారు.

సైన్స్‌పై ఆసక్తి కల్పిస్తున్న... నారాయణవర్మ


నారాయణవర్మ

మామడ: పాఠ్యాంశాలను కృత్యాలతో బోధిస్తూ కఠినమైన భౌతిక అంశాలను సైతం విద్యార్థులకు సులభమైన పద్ధతిలో బోధించి సైన్స్ పట్ల ఆసక్తిని కల్పిస్తున్నారు. ఉపాధ్యాయులకు బోధన వ్యూహాలపై అవగాహన కల్పించి విద్యార్థులకు అర్థమయ్యే పద్ధతిలో బోధించాల్సిన అంశాల్లో శిక్షణ కేంద్రాల్లో అవగాహన కల్పించి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యాడు. అతడే మామడ మండలంలోని కొరిటికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతిక రసాయనశాస్త్ర ఉపాధ్యాయుడు పాలకొండ నారాయణవర్మ. 2002 డీఎస్సీలో ఎస్‌జీటీగా ఎంపికై పదోన్నతిపై భౌతిక రసాయనశాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. 2001లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నాడు. జిల్లా, రాష్ట్రస్థాయిలో సైన్స్ సబ్జెక్ట్‌కు రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. ఓపెన్‌స్కూల్ విభాగంలో సైన్స్ అండ్ టెక్నాలజీలో పాఠ్యాంశాలను అందించారు. వర్మ ఎడ్యుకేషన్ పోర్టల్ యూట్యూబ్‌ను రూపొందించి భౌతికరసాయన పాఠ్యాంశాలను వ్యూహాల విధానంపై అవగాహన కల్పిస్తున్నారు.


మంజులాపూర్‌లో ఉపాధి హామీ పనుల వద్ద బడిబాట నిర్వహిస్తున్న పద్మ(ఫైల్)


సిద్ధ పద్మ

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కారించాలి


వినతిపత్రం అందిస్తున్న లక్ష్మారెడ్డి

నస్పూర్: దేశవ్యాప్తంగా బొగ్గు పరిశ్రమలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని బీఎంఎస్ బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జి కొత్తకాపు లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం ఆయన న్యూఢిల్లీలో కేంద్ర కోల్ మంత్రిత్వశాఖ కార్యదర్శి అమృత్‌లాల్‌మీనాకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బొగ్గు పరిశ్రమలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు పెరిగిన జీతభత్యాలు చెల్లించాలని, సామాజిక ఆర్థిక ఉద్యోగ భద్రత కల్పించాలని, అన్ని గనుల్లో భద్రతా నిబంధనల ఉల్లంఘనపై పూర్తి స్థాయి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా సీఎంపీఎఫ్ పూర్తి స్థాయిలో ఆన్‌లైన్ పద్ధతిలో అమలు చేయాలని తెలిపారు.

పంట పొలాల్లోకి నెమలి


నెమలిని అప్పగిస్తున్న ఎంపీటీసీ, స్థానికులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని వేంపల్లి గ్రామ శివారులోని పంటపొలాల్లోకి అటవీ ప్రాంతం నుంచి ఓ నెమలి వచ్చింది. వచ్చిన నెమలి స్వల్ప గాయాలతో అస్వస్థతకు గురై పొలంలోనే ఉండిపోయింది. స్థానిక రైతు కొమురయ్య వెంటనే ఎంపీటీసీ డేగ బాపుకు తెలియజేయడంతో పంటపొలంలో అస్వస్థతతో పడి ఉన్న నెమలిని బయటకు తీసుకొచ్చారు. స్థానిక అటవీ అధికారులకు సమాచారం అందజేయడంతో బీట్ అధికారి తిరుపతి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. ముందుగా నెమలికి తగిన వైద్యం అందించి కోలుకోగానే ఆ నెమలిని అటవీ ప్రాంతంలో సురక్షితంగా వదిలిపెట్టారు.

సీఎంఓను కలిసిన ఏఐటీయూసీ నాయకులు


సీఎంవోను సన్మానిస్తున్న బెల్లంపల్లి బ్రాంచి ఏఐటీయూసీ నాయకులు

కాసిపేట: సింగరేణి కాలరీస్ కంపెనీ కొత్తగూడం ఏరియా ఆస్పత్రి నూతనంగా సీఎంవోగా బాధ్యతలు స్వీకరించిన సుజాతను శనివారం బెల్లంపల్లి బ్రాంచి ఏఐటీయూసీ నాయకులు కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో బెల్లంపల్లి బ్రాంచి ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, నాయకులు నాగరాజు తదితరులు ఉన్నారు.

భర్తను హతమార్చిన భార్య


తిరుపతి మృతదేహం

చెన్నూర్: మద్యానికి బానిసై వేదిస్తున్న భర్త ప్రవర్తనకు విసుగు చెంది తల్లితో కలిసి భర్తను హత్యచేసిన ఘటన చెన్నూర్‌లోని కొత్తగూడెం కాలనీలో శనివారం చోటు చేసుకుంది. సీఐ వాసుదేవరావు వివరాల ప్రకారం... చెన్నూర్ మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన మడక తిరుపతి (34) పన్నేండ్ల క్రితం సౌందర్యతో వివాహమైంది. భార్య పిల్లలతో తిరుపతి చెన్నూర్ పట్టణంలోని కొత్తగూడెం కాలనీలోని అత్త లక్ష్మి ఇంట్లో ఉంటూ బట్టల షాపులో సెల్స్‌మేన్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తిరుపతి మద్యంతాగి భార్యతో తరుచుగా గొడవ పడే వాడు. శుక్రవారం రాత్రి మద్యం తాగి వచ్చి గొడవపడ్డాడు. భర్త వేధింపులు తాళలేక భార్య సౌందర్య, అత్త లక్ష్మి ఇరువురు కలిసి శనివారం తెల్ల వారు జామున రోకలి బండతో తలపై బాదారు. దీంతో తిరుపతి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని ఓ ప్రైవేట్ అంబులెన్స్‌లో ఎర్రగుంటపల్లి గ్రామంలోని తిరుపతి ఇంట్లో వదిలి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడని చెప్పి వెళ్లిపోయారు. మృతుడి అన్న మడక సమ్మయ్య అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చెన్నూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వాసుదేవరావు పేర్కొన్నారు.

గురుకుల డిగ్రీ ప్రవేశాలను సద్వినియోగం చేసుకోవాలి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గురుకుల డిగ్రీ కళాశాలల్లో ప్రవేశం పొందాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌సీఓ గోపీచంద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో మహిళా డిగ్రీ కళాశాలలు, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో బాలుర డిగ్రీ కళాశాలలు మంజూరయ్యాయని అన్నారు. బీఏ(ఈపీహెచ్), బీకాం(సీఏ), బీఎస్సీ(ఎంపీసీఎస్), బీఎస్సీ(బీజడ్సీ) కోర్సులలో నేరుగా ప్రవేశం కలిపిస్తున్నామని, అర్హులైన విద్యార్థులు వెంటనే దోస్త్ రిజిస్ట్రేషన్‌తో సంబంధిత కళాశాలల్లో సంప్రదించాలని తెలియజేశారు. పూర్తి వివరాలకు జిల్లా కన్వీనర్‌లను సంప్రదించాలని సూచించారు. బాలుర డిగ్రీ కళాశాలల కోసం సేరు శ్రీధర్ -7993456620(మంచిర్యాల), హుస్సేన్ -8317549426(నిర్మల్)లను సంప్రదించాలని తెలిపారు. ఇక మహిళల డిగ్రీ కళాశాలల కోసం శ్రీవిద్య-9705736201(ఆదిలాబాద్), సృజనాదేవి -9491322883(కొమురంభీం ఆసిఫాబాద్)లను అడ్మిషన్ల కోసం సంప్రదించవచ్చని తెలిపారు. అడ్మిషన్ పొందిన విద్యార్థులకు అన్ని వసతులు, సదుపాయాలు కల్పించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌సీఓ గోపీచంద్ తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో టీచర్ మృతి

- స్కూటీపై వెళ్తుండగా ముఖానికి అడ్డువచ్చిన చున్నీ
- తొలగించే క్రమంలో ప్రమాదం


కుటుంబంతో మంజుల (ఫైల్)

ఆసిఫాబాద్‌రూరల్/మందమర్రిరూరల్: ప్రమాదవశాత్తు స్కూటీపై నుంచి పడి మహిళ టీచర్ మృతిచెందగా మరో టీచర్‌కు తీవ్ర గాయాలైన సంఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మందమర్రికి చెందిన మంజుల (34), మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన చెందిన నిర్మల వాంకిడి మండలంలో వేర్వేరు ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. మంజుల నార్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా, నిర్మల వాంకిడి ఉన్నత పాఠశాలలో ఎస్ఏగా విధులు నిర్వహిస్తున్నారు. వీరు ఇటీవల బదిలీపై జిల్లాకు వచ్చారు. నిత్యం బస్సులో ఆసిఫాబాద్‌కు వచ్చి అక్కడి నుంచి స్కూటీపై వాంకిడికి వెళ్తుంటారు. శనివారం కూడా ఆసిఫాబాద్‌కు వచ్చి స్కూటీపై వాంకిడికి వెళ్తున్న క్రమంలో ఇప్పల్ నవెగాం వద్ద ఎదురుగా లారీ వస్తుండగా గాలికి మంజుల ముఖానికి చున్నీ అడ్డు రాగా చేతితో తొలగించే క్రమంలో స్కూటీ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో ఇద్దరు కిందపడ్డారు. అటువైపు నుంచి వస్తున్న మరో ఉపాధ్యాయుడు గమనించి 108 అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు. ప్రథమ చికిత్స అనంతరం మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గంమధ్యలో మంజుల మృతిచెందింది.

మందమర్రిలో విషాదం...

మందమర్రి పట్టణంలోని దీపక్‌నగర్‌కు చెందిన నామని సురేష్ గతంలో హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్న క్రమంలో సంగారెడ్డికి చెందిన మంజులతో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. 2017లో ఇరు కుటుంబ సభ్యులను ఒప్పించి పెళ్లి చేసుకున్నారు. వీరికి అరుషీ(7), దక్ష(3) కూతుర్లు ఉన్నారు. మంజుల హైదరాబాద్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుండగా.. సురేష్ తండ్రి సింగరేణిలో ఉద్యోగం చేసి మెడికల్ అన్‌ఫిట్ కావడంతో అతడికి ఉద్యోగం రాగా కాసిపేట గనిలో విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో ఏడాదిన్నర క్రితం మంజులకు కుమురం భీం జిల్లాకు బదిలీపై వచ్చింది. మంజుల అంత్యక్రియలను చిన్నకూతురుతో చేయిస్తుండడం స్థానికులను కలిచివేసింది.

అంతర్ జిల్లా మోసగాళ్లు అరెస్ట్

- ప్రైవేట్ సొసైటీ పేరుతో మోసాలు
- ఐదు బ్రాంచ్‌లలో 1,600 మంది దగ్గర రూ.3 కోట్ల వసూలు
- రియల్‌ఎస్టేట్, లిక్కర్, చిట్‌ఫండ్స్‌లలో పెట్టుబడులు
- రాజన్నసిరిసిల్ల, మంచిర్యాల జిల్లాల్లో ఐదు కేసులు
- ఎస్పీ అఖిల్ మహాజన్


నిందితులను అరెస్టు చూపుతున్న ఎస్పీ అఖిల్‌మహాజన్, సీఐ కరుణాకర్

వేములవాడ: ప్రైవేట్ కంపెనీని ఏర్పాటు చేసి ప్రజల నుంచి భారీ ఎత్తున వసూలు చేసి మోసానికి పాల్పడ్డ ఇద్దరిని రాజన్నసిరిసిల్ల జిల్లా పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. మంచిర్యాల జిల్లా రామ్‌నగర్‌కు చెందిన కర్ల శ్రీధర్, జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలోని చెగ్యాం గ్రామానికి చెందిన పోతరాజు లక్ష్మణ్‌లను అరెస్టు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. మంచిర్యాల జిల్లా రామ్‌నగర్‌కు చెందిన కర్ల శ్రీధర్ 2000 సంవత్సరంలో మంచిర్యాల జిల్లాలో ఉజ్వల థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ, మ్యూచువల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ కంపెనీని స్థాపించారు. ఆరు నెలల వ్యవధిలోనే బెల్లంపల్లి, లక్సెట్టిపేట, సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో సొసైటీలు స్థాపించారు. దాదాపు 1,600 మంది వరకు ఖాతాలు తెరవడంతో రూ.3 కోట్ల వరకు సేకరించారు. శ్రీధర్ చైర్మన్‌గా, తన పూర్వ విద్యార్థి పోతరాజుల లక్ష్మణ్‌ను సీఈవోగా నియమించుకొని మరికొంత మంది సిబ్బందిని తీసుకున్నారు. ప్రజల నుంచి రికరింగ్ డిపాజిట్స్ ద్వారా డబ్బులు వసూలు చేశారు. ఆ డబ్బులను శ్రీధర్, లక్ష్మణ్ కలిసి మంచిర్యాల, నిజామాబాద్ జిల్లాల్లో రియల్ ఎస్టేట్, లిక్కర్, చిట్‌ఫండ్స్‌లలో పెట్టుబడి పెట్టారు. వివిధ స్కీమ్‌ల ద్వారా 150 మందికిపైగా సభ్యత్వం కల్పించి, సొసైటీలో ఖాతా తెరిచేందుకు రూ.650 వసూలు చేశారు. తమ సొసైటీలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తే తక్కువ కాలంలోనే రెట్టింపు అవుతుందని నమ్మించారు. గత నెల 22న వేములవాడకు చెందిన బుస్స శ్రీనివాస్ మరికొందరు బాధితులు వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈనెల 1న వ్యాపారం కోసం శ్రీధర్, లక్ష్మణ్‌లు కరీంనగర్ నుంచి సిరిసిల్లకు వెళ్తుండగా వేములవాడటౌన్ పోలీసులు నందికమాన్ వద్ద అరెస్ట్ చేసినట్లు చెప్పారు. కారు, సొసైటీకి సంబంధించిన కరపత్రాలు, పాస్‌బుక్స్, అకౌంట్ ఓపెనింగ్, క్లోజింగ్ ఫామ్స్, లావాదేవీలకు సంబంధించిన రిజిష్టర్స్, మూడు మొబైల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ప్రైవేట్ కంపెనీలు, ఆన్‌లైన్ మోసాలకు పాల్పడవద్దని, ఏదైన సమస్యలు ఉంటే నేరుగా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్, పోలీసులు పాల్గొన్నారు.

గైర్హాజరు కార్మికులకు ఫ్యామిలీ కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఏజెంట్ గోపాల్ సింగ్

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్‌పీ 1 గని గైర్హాజరు కార్మికులకు శ్రీరాంపూర్‌లోని గ్రూప్ ఆఫ్ మైన్స్ కార్యాలయంలో శనివారం ఏజెంట్ గోపాల్ సింగ్ ఫ్యామిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజెంట్ ఉద్యోగులను అడిగి గైర్హాజరుకు గల కారణాలను తెలుసుకున్నారు. హాజరు శాతాన్ని మెరుగుపరుచుకోవడానికి పలు సూచనలు చేశారు. గైర్హాజరు అయితే యాజమాన్యం తీసుకునే చర్యలను వారికి వివరించారు. ఈ కౌన్సెలింగ్‌కు 21 మంది గైర్హాజరు ఉద్యోగులు హాజరు అయినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ విజయ్‌కుమార్, వెల్ఫేర్ ఆఫీసర్ పాలకుర్తి రాజు, పిట్ సెక్రటరీ ఎంబడి తిరుపతి పాల్గొన్నారు.

ఎస్టీపీపీ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

- హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు రియాజ్ అహ్మద్


దీక్షలో కార్మికులు, నాయకులు

జైపూర్: సింగరేణి పవర్ ప్లాంట్‌లో స్థానిక భూనిర్వాసితులు, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ తెలిపారు. మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు ప్రధాన గేటు వద్ద శనివారం సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ హెచ్‌ఎంఎస్ అనుబంధ ఎస్టీపీపీ కాంట్రాక్టు కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులకు మద్దతు తెలిపి మాట్లాడారు. ఎస్టీపీపీ అధికారులు కార్మికులపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని, న్యాయపరంగా రావాల్సిన హక్కులపై ప్రశ్నించిన కార్మికులను విధుల్లో నుంచి తొలగించి అన్యాయానికి పాల్పడుతున్నారని, తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జైపూర్ పవర్ ప్లాంటుతో సింగరేణి యాజమాన్యానికి వేల కోట్లల్లో లాభాలు వస్తున్నప్పటికీ ఇక్కడి కాంట్రాక్టు కార్మికుల శ్రమ ఫలితమేనని కార్మికులకు లాభాల వాటా చెల్లించడంతో పాటు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. దీక్ష అనంతరం ఎస్టీపీపీ జీఎం బసివిరెడ్డిని కలిసి కార్మిక సమస్యలపై చర్చించి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంఎస్ ఎస్టీపీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రదీప్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీ విక్రమ్, సెక్రెటరీ సాయికృష్ణరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సంపత్ ఉన్నారు.